# మినీకథ

# ఓ శుభోదయాన

కె. నిర్మల

తెల్లవారకుండానే సన్నగా తుంపర ప్రారంభమయింది. వెచ్చగా దుప్పటి ముసుగులో హాయిగా విశ్రమించిన నాకు. బద్ధకంగా లేవాలనిపించలేదు. కాని తప్పుతుందా ఆడజన్మకు? లేవక తప్పదన్నట్లుగా లేచాను.

ఇక పరుగులూ. ఉరుకులూ ప్రారంభం. దంతధావనం ముగించుకునివచ్చి చూద్దును గదా డిపో పాలు ఇంకా రాలేదు ఇంక కాలుగాలిన పిల్లిలా. ఇంట్లోకి. వాకిట్లోకి తిరగటం ప్రారంభించాను. బాగా ముసురు పట్టింది. వానాకాలం కదా మరి? పెద్దవాన ప్రారంభమైంది. బయట వాన పడుతుంటే వేడివేడిగా కాఫీ త్రాగాలన్న ఆరాటం మరింత ఎక్కువయింది నాలో. అదేం ఖర్మమోకానీ. ఇల్లాంటి సమయంలోనే పాలు రాకపోవటమో. ఆలస్యంగా రావటమో జరుగుతుంది. ఆ కాఫీ త్రాగితేగాని ఒంట్లోకి సత్తువరాదు. పనిలో చురుకూ ఉండదు.

అంత వానలో గడపలోనే నిలబడ్డాను. ఏ పాలవాళ్ళన్నా గడప ముందు నుంచి పోతపోతారా అన్న ఆశతో. కానీ వాళ్ళు కూడా 'మావాడుక ఇళ్ళకు పోయాలంటూ' జారుకున్నారు. ఓ పావు పాలుపోస్తే మరో పావలా ఎక్కువ ఇస్తానని కూడా ఆశ పెట్టాను. ఎంతో బ్రతిమాలాను. కానీ ఎవ్వరూ ఒక చెంబాడు పాలు కూడా పొయ్యలేదు. కాళ్ళీడ్చుకుంటూ నీరసంగా లోపలకు కదిలాను.

అరె! పాలతోపాటు పని మనిషి జాడ కూడా లేదు. పని మనిషి వస్తే పాలు తెప్పిద్దామన్న ఆశ కూడా అడియాస అయింది. ఆ చిరాకుతోనే శ్రీవారిని కుదిపి లేపేశాను. పాలు రాలేదంటూ.

"పాలు రాలేదా? అయితే ఏకంగా తొమ్మిదింటికే నిద్రలేపు నన్ను. స్నానం కానిచ్చి. ఆ వెంటనే భోంచేసి ఆఫీసుకు వెళ్ళిపోతాను. ఈ కాఫీ బాధయినా తప్పుతుంది ఈ వానలో. ఈ చలిలో పాలు తీసుకురావటం నా వల్ల కాదు" అంటూ నిండా ముసుగు కప్పుకుని బిగదీసుకుని పడుకున్నారు.

"ఓయ్! దేముడా. ఇంక ఈయనగారు నిజంగానే పక్కమీద నుంచి లేచేటట్లు లేరు." పాలు ఇక రావని నిర్ధారణగా తెలిసిన తర్వాత. కాఫీ పిచ్చి మరీ ఎక్కువయిపోయింది. తలమీద టర్కిష్ టవలు కప్పుకుని ప్రక్కింటికెళ్ళాను. వాళ్ళబ్బాయేమన్నా కాసిని పాలు తెచ్చాడేమో కనుక్కుందామని అయినా నా పిచ్చికానీ ఇలాంటి సమయాల్లో ఓ గుక్కెడు పాలయినా ఇస్తారా ఎవరయినా? తీరా వాళ్ళింటికిపోయి చూద్దును కదా.... చక్కగా వాళ్ళ కుటుంబసభ్యులంతా వంటింట్లో చేరి. వేడిగా పొగలు కక్కుతున్న కాఫీని సేవిస్తున్నారు. కాఫీ వాసన తగలగానే పోయిన ప్రాణం లేచి వచ్చినట్లయింది.

"వదినగారూ! ఓ బుల్లిగ్లాసుడు పాలుంటే ఇస్తారూ? పనిమనిషి రాగానే తెప్పించి ఇస్తాను" అన్నాను. వారి పెద్దగిన్నె సగానికి పైనే వున్న పాలవంకే దృష్టి నిలుపుతూ.

ఇంక ఆ ఇల్లాలికి పాలులేవని తప్పించుకునే అవకాశమే లేకపోయింది పాపం!



ఆదరా బాదరాగా ఇంటికి పరుగెత్తుకొచ్చి. కాఫీ చేసుకుని ఆప్యాయంగా త్రాగాను. వెంటనే నాకు కాస్త ఉషారొచ్చింది. ప్రక్కింటివారి రేడియోలోంచి తెలుగు వార్తలు వినిపిస్తున్నాయి. అబ్బా: అప్పుడే ఏడయిందా? ఈ మబ్బు. వానవల్లి టైమే తెలియలేదు. ఇహ నాపని అయినట్టే .... ఎనిమిది గంటలకల్లా వంట పూర్తవ్వాలి: హడావిడిపడుతూ వాకిట్లో బర బరా చిమ్మేసివచ్చి. గిన్నెలు ముందేసుకుని కూర్చున్నాను ఈ పాలు రాకపోవటంతో కొంత ఆలస్యం. పనిమనిషి నాగా పెట్టటంతో మరికొంత.... అయినా ఏం పని వాళ్ళోనండీ బాబూ. వాళ్ళదే రాజ్యం. వాళ్ళదే నోరు. నాగాలు చెయ్యనీ. బూజ్లె మూకుడులో జిడ్డువదలకపోనీ. అన్నం గిన్నెలో మెతుకులు పోకపోనీ. మజ్జిగ గిన్నెలో. పాలగిన్నెలో ఆ చారలు పోక పోయినాగానీ. మనం వాళ్ళను ఇదేమిటని అడుగకూడదు. చుట్టాలు వచ్చినప్పుడు పని మనిషి అసలు రాదు. పెద్దవాన వస్తే పని మనిషి గైర్‌హాజర్! వానాకాలంలో మరి వానలు కురవకుండానే వుంటాయా? వాన కురిసినప్పుడల్లా నాగా పెడుతూ. ఫస్టు తారీకు రాకుండానే జీతానికి తయారు. ఇలా ఎక్కువ నాగాలు చేసేటట్లయితే. నాగాలకు డబ్బు పట్టుకుని జీత మిస్తాను అన్నామో. ఇంక మన పరువు బజార్లోనే వుంటుంది. వాళ్ళ అరుపులకు. ఆ గొంతుకు భయపడి పూర్తి జీతం ఇవ్వాల్సిందే. డబ్బిచ్చి ఇబ్బంది పడకతప్పదు. ఏం చేస్తాం. రోజులలా వున్నాయి మరి!

అరెరే! ఏమిటి ఇలా కూర్చున్నాను. అన్నట్లు గ్యాస్ కూడా అయిపోయింది. ఆ సంగతే మరిచాను. దేముడి గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేసినట్లు ప్రతి రోజూ గ్యాస్ కంపెనీచుట్టూ ప్రదక్షిణాలు చేస్తూనేవున్నాను వారం దాటినా. గ్యాస్ ఇంకా రాలేదు. ఆ ఒత్తుల స్టౌ మీద కుక్కరే పెట్టి వండేటప్పటికి తలప్రాణం తోకకు వస్తోంది.

ఉష్ ఏమిటో.... స్త్రీలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. బాగానే వుంది. బాధ్యతలు పెరగటం. విశ్రాంతి లేకుండా శ్రమించటం మిగిలింది స్త్రీలకు. ఈ స్త్రీ స్వాతంత్ర్యం అనేది వచ్చి. మగవాళ్ళకు విశ్రాంతినిచ్చింది. ఇంటి పనంతా పూర్తిచేసుకుని శ్రీవారిని ఆఫీసుకు పంపి పిల్లలను కాన్వెంటుకు తయారుచేసి. ఆ తర్వాత హడావిడిగా నాలుగు మెతుకులు కతికి ఆఫీసుకు పరుగెత్తాలి నేను. మరి నేనూ ఉద్యోగినికదా?

అన్నట్లు.... వస్తూవచ్చింది సాయంత్రం స్కూలునుంచి వస్తు- పచారీ సామానులు తెచ్చుకోవాలి. కూరలు కూడా అయిపోయాయి. కూరల మార్కెట్టుకు కూడా వెళ్ళాలి. ఏమిటో మరీ... ఆడదాని జీవితం యాంత్రికంగా మారిపోయింది.

అరెరే! శ్రీవారితోపాటు. పిల్లలూ లేచేశారు. అందరికి ఇంత హార్లిక్స్ అయినా కలపాల్సిందే. ఇంకా బూత్‌పాలు రానే లేదు. పాలుతెచ్చే వ్యాన్‌కు జబ్బుచేసిందేమో పాపం! బాబోయ్ ఇంక వంటిట్లో దూరకపోతే ప్రమాదం. వంటవ్వకపోతే టైమయిందంటూ శ్రీవారి చిందులూ. పిల్లల గెంతులూ.... అప్పుడు నేనేమోరన్నింగూ!